## మళ్లీ అమరావతి కథలు

సత్యం శంకరమంచి




వరద వచ్చినప్పుడు రేవులో రేగడి పేరుకుంటుంది. ఆ రేగడి మట్టి ఇటుకల తయారీకి చాలా శ్రేష్ఠం. ఆ మట్టితో ఎవరో ఇటుకలు తయారుచేస్తుంటే వూరి పెద్ద వచ్చి "ఎవడబ్బ సొమ్మనిరా అడగా పెట్టకుండా ఇటుకలు చేస్తున్నారు" అని నిలదీశాడు.

"అదేవిటి బాబూ? కిష్ట వచ్చినప్పుడు కొట్టుకొచ్చిన మట్టేగదా" అన్నారు వాళ్ళు.

"సరె సర్లె ఈ స్థలం నాది. ఇందులో ఉన్న రేగడి మట్టి కూడా నాదే" అన్నాడు భూషయ్య.

వాళ్ళు తెల్లబోయి "అయితే ఇప్పుడేం చెయ్యమంటారు" అన్నారు. "ఆ మట్టికి రెండొందలివ్వండి" అన్నాడు.

"బాబోయ్? చాలా ఎక్కువ బాబోయ్" అని కాళ్ళా వేళ్లా పడ్డారు.

చివరికి వందన్నరకి బేరం కుదిరింది.

రేవులో పక్కనున్న ఖాళీ స్థలం చూపించి "అయ్యా ఈ స్థలంలో ఇటిక ఆవేసి కాల్చుకుంటాం. అది కూడా తవరిదేనా?" అన్నారు.

"అదీ నాదే! నిరభ్యంతరంగా వాడుకోండి. వందకి పది ఇటుకలు నా కివ్వండి" అన్నాడు భూషయ్య.

"అలాగే" అని వొప్పుకున్నారు.

రేవులో రేగడి మట్టి నాదంటే కాదనే దెవరు? నాది అని ఇంకొకళ్లు వస్తే గదా? అలా ప్రతి సంవత్సరం ఆ మట్టి అమ్ముకుని, ఇటుకలు అమ్ముకుని బోలెడు గడించాడు భూషయ్య.

భూషయ్య స్నేహితుడు రామయ్య. ఒకసారి పనుండి గుంటూరు వెళ్ళి పేరయ్య దగ్గర అప్పు తీసుకున్నాడు. పేరయ్య ఏదన్నా హామీ ఉంటే గదా? అప్పు ఇవ్వనన్నాడు.

"దానికేమి నా స్థలం తాకట్టు పెడ్తాను," అన్నాడు రామయ్య.

అలా పత్రం రాయమన్నాడు. రాసేశాడు.

"తూర్పున సుబ్బరామయ్య గారి చేను, దక్షిణాన వెంకట్రామయ్యగారి పొలం. పడమట సీతారామయ్య గారి చేను. ఉత్తరాన కృష్ణ వొడ్డు...ఫలానా ఫలానా సర్వే నెంబర్ల గల నా స్థలం తాకట్టుగా పెట్టడమైనది."

సంవత్సరమైంది, రెండేళ్ళయింది. రామయ్య బాకీ తీర్చడే!

స్వామిని మూసుకున్నట్టు ఉంటుంది. స్థలాన్ని మూసుకోవచ్చునని ఓ తొలి ఏకాదశినాడు పేరయ్య తనే అమరావతి వచ్చాడు. గుళ్ళో అభిషేకం చేసుకుని, అమ్మవారికి పూజ చేసుకుని, ఎవర్నో వెంట బెట్టుకుని ఆ హద్దులు గల స్థలానికి వచ్చాడు.

ఆ స్థలం స్మశానం!

ఒక పక్క ఓ శవం కాలుతుంటే, ఇంకో పక్క ఎవరో అస్థికలు ఏరుకుంటున్నారు.

పేరయ్య దివాలా అయిపోయినట్టు బాధపడి రామయ్య ఇంటికి పరుగు పరుగున వెళ్ళాడు. రామయ్య ఊళ్ళో లేడని తెలిసింది. ఈ విషయం తెలిసినవాళ్ళు పేరయ్యకి చెప్పారు. రామయ్య స్మశానం నీకొక్కడికే కాదు చాలా మందికి తాకట్టు పెట్టి అప్పులు తెచ్చాడని. రామయ్య, భూషయ్య ఆంజనేయస్వామి రేవులో స్నానం చేస్తూ "ఒరేయ్ కిష్టలో కొట్టుకొచ్చిన రేగడిమట్టి అమ్మేశ్రా నా" అని ఒకరంటే "నేను స్మశానం మళ్ళీ తాకట్టుపెట్టా నా!" అని ఇంకొకరన్నారు. ఇద్దరూ నవ్వుకొన్నారు. "సరే! మరి పంచాయతీ బోర్డు ప్రెసిడెంట్‌కి నేను నుంచోవాలనుకొంటున్నాను" అన్నాడు భూషయ్య.

"అయ్యో! నాకు ముందు చెప్పలేదేం! నేను నుంచుంటున్నానని అందరికీ చెప్పేశానే" అన్నాడు రామయ్య.

"అయితే మనిద్దరికీ పోటీ అన్నమాట" అని కొరకొర చూశాడు భూషయ్య.

"ఏం చేస్తాం అమరేశ్వరుడు అలా రాసి పెట్టాడు" అన్నాడు రామయ్య.

ఇద్దరు వొళ్ళు తుడుచుకుని ఇళ్ళకు వెళ్ళిపోయారు.

రామయ్య సరాసరి సీతయ్య ఇంటి కెళ్ళి తనే చాప వేసుకు కూర్చుని "బావా భూషయ్య పంచాయితీ బోర్డు ప్రెసిడెంటవుతే మనం బతగ్గలమా?" అన్నాడు.

"ఛీఛీ! మీసాలు గొరిగించుకోవలసిందే" అన్నాడు సీతయ్య బుంగమీసం మెలి తిప్పుతూ.

"మరయితే నువ్వే పోటీ చెయ్యరాదా!" అన్నాడు రామయ్య.

"మనం గెలుస్తామంటావా?"అని సందేహించాడు సీతయ్య.

"ఇలా చెయ్యి కొట్టు. భూషయ్య వ్యవహారం తేల్చేస్తాను" అన్నాడు రామయ్య.

'సరే' అన్నాడు సీతయ్య.

భూషయ్య సరాసరి వెంకయ్య ఇంటికెళ్ళి "అల్లుడా! మనం ఈ వూర్నించి మకాం ఎత్తెయ్యొచ్చు" అన్నాడు.

"అంత కష్టమేమొచ్చింది?" అన్నాడు వెంకయ్య.

"ఇంతకంటె ఇంకేం రావాలి? ఆ రామయ్యగాడు పంచాయితీ ప్రెసిడెంట్‌కి నుంచుంటున్నాడు" అన్నాడు భూషయ్య.

"ఆ స్మశానం వెధవ!"

"ఆ స్మశానం వెధవే!"

"మన బతుకులెందుకు?"

"మన జన్మెందుకు? అని అనుకోడం కాదల్లుడా! నువ్వు ఎదురుగా పోటీ చేసి వాణ్ణి చిత్తుగా వోడించి స్మశానానికి పంపించాలి" అన్నాడు భూషయ్య.

"సై"

"సై"

రెండు వేలు పట్టాడు భూషయ్య.

చివరికి రంగంలో వెంకయ్య, సీతయ్య మిగిలారు. వాళ్ళిద్దరూ చెరొక ఐదువేలు తగలేసుకొని రాజీపడి ఒకళ్ళు ప్రెసిడెంటు, ఇంకొకళ్ళు వైస్ ప్రెసిడెంటు అయ్యారు.

ఆంజనేయస్వామి రేవులో స్నానానికి వచ్చినప్పుడు మళ్ళీ భూషయ్య, రామయ్య కలిశారు.

ఏరా! బావున్నావా? అంటే బావున్నావా! అని పలకరించుకొన్నారు.

"ఒరేయ్! ఈ తడవ దేనికైనా పోటీచేసేటప్పుడు నాకు చెప్పి చెయ్యి" అన్నాడు భూషయ్య.

"నువ్వూ అదే చెయ్యవోయ్!" అన్నాడు రామయ్య.

"ఒరేయ్! మనిద్దరం కలిసి పనిచేస్తే ఎలా వుంటుందంటావ్?" అన్నాడు భూషయ్య.

"దివ్యంగా ఉంటుంది" అన్నాడు రామయ్య.

ఇద్దరూ నవ్వుకున్నారు. వీపులు చరుచుకున్నారు.

ఆలోచించి ఆలోచించి రైతాంగానికి అప్పులిచ్చే సంస్థ పెట్టి భూషయ్య అధ్యక్షుడిగా, రామయ్య కార్యదర్శిగా దొంగ వేలిముద్రలు, ఫోర్జరీ సంతకాలతో ఊర్ని చల్లగా పాలించారు. ●